## క్లుప్తంగా

### రేపు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరు(ఎం): ఈ నెల 17న (ఆదివారం) ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి మండల కేంద్రానికి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

### పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని వినతి

చౌటుప్పల్: మండల పరిధిలోని అంకిరెడ్డిగూడెం గ్రామంలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 1350కి పైగా ఓట్లు ఉన్నప్పటికీ ఒకే పోలింగ్ బూత్ ఉండడంతో రానున్న సర్పంచ్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల జంగయ్య, పర్నె శ్రీనురెడ్డి, సుర్వి వెంకటేశం, సాయిరాం, బాలరాజు పాల్గొన్నారు.

### సీఎం, మంత్రులను కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



సీఎం రేవంత్‌రెడ్డితో బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అలయ్య శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ప్రభుత్వ విప్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావును కలిసి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

### కాంగ్రెస్‌లో చేరిక

యాదగిరిగుట్ట : సీపీఐ మండల కార్యదర్శి జిల్లా జానకిరాములు, మున్సిపల్ 1వ వార్డు కౌన్సిలర్ గౌళికార్ అరుణ రాజేష్‌లు శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి విప్ బీర్ల అయిలయ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

**కల్యాణ మహోత్సవానికి రావాలని ఆహ్వానం**

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో నిర్వహించనున్న నిమ్మగుంట్ల ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ ఆ గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీమగాని రాములు, దేవాలయ కమిటీ సభ్యులు డీలర్ శంకర్, తుంగ అశోక్, గంధమల్ల రాములు, క్లాశె రాజు, కొల్లూరి కిష్టయ్య, కాల్నె స్వామి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### బెల్టుషాపులు ఎత్తివేస్తామని ప్రకటించడం హర్షణీయం



సమావేశంలో పాల్గొన్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

రామన్నపేట : బెల్టుషాపులు ఎత్తివేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని కల్లుగీత కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజు అన్నారు. శుక్రవారం జరిగిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్టుషాపుల వల్ల యువత మద్యానికి బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద కుటుంబాలు బాగుపడతాయన్నారు. సమావేశంలో కూనూరు మల్లేశం, పులి భిక్షం, ఎర్ర రవిందర్, తొల్పునూరి శ్రీనివాస్, మునుకుంట్ల లెనిన్, పోలగోని నర్సింహ, కనకయ్య పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మోత్కూరు : పద్మశాలీ సంఘం మున్సిపల్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎలగందుల సత్యనారాయణ, అధ్యక్షుడిగా కూరపాటి రాములు, ప్రధాన కార్యదర్శిగా వంగరి రాములు, ఉపాధ్యక్షుడిగా పసునూరి యాదయ్య, కోశాధికారిగా నోముల రమేష్, కార్యవర్గ సభ్యులుగా పసునూరి రమేష్, గుర్రం చంద్రశేఖర్, పోచం రాజు, ముశం సంతోష, ముశం సోమేశ్వరి, తాటి కరుణాకర్, జల్ది సత్యనారాయణ, జోగు రామచంద్రయ్య, బిరుదు శ్రీను, చిందం శ్రీనివాస్, ఏల్ల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, మోత్కూరు చేనేత సహకార సంఘం అధ్యక్షులు జెల్ది రాములు, మాజీ అధ్యక్షుడు పెండెం శ్రీను, సహకార సంఘం కార్యదర్శి గంగుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మూలమలుపులు

- రోడ్ల వెంట కానరాని సూచిక బోర్డులు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు



దాతర్‌పల్లి-యాదగిరిగుట్ట మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



సైదాపురం- మాసాయిపేట గ్రామాల మధ్య..

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాల్లో ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇరుకైన రహదారులకు తోడు ప్రమాదకర మూలమలుపులు ఉండడం రోడ్లన్నీ గుంతలమయంగా మారి అధ్వానంగా తయారవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూలమలుపుల వద్ద కంపచెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే చాలామంది ప్రమాదాలకు గురికావడం, ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు జరిగాయి. మూలమలుపుల రోడ్ల వద్ద సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రమాదకర మలుపులు..**

మండలంలోని పలు రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. ముఖ్యంగా దాతర్‌పల్లి గ్రామం నుంచి యాదగిరిగుట్ట వెళ్లే మార్గంలో ఉన్న మూలములుపుల వద్ద ఒక్క సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన చుక్కల నర్సింహ అనే వ్యక్తి ద్విచక్ర వాహనం మీద వస్తుండగా మూలమలుపు వద్ద ప్రమాదం చోటుచేసుకోవడంతో గాయాలపాలయ్యాడు. మాసాయిపేట - సైదాపురం గ్రామాల మధ్య ఉన్న మలుపు వద్ద రాత్రి వేళల్లో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మహబూబ్‌పేట - వంగపల్లి మధ్య ఉన్న మూలమలుపు, గొరాయపల్లి- మాసాయిపేట గ్రామాల మధ్య ఉన్న రెండు మూలమలుపులు, మాసాయిపేట - కాచారం గ్రామాల మధ్య రహదారిలో రోడ్డు వెంట ముళ్ల చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

**సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి**



దాతర్‌పల్లి-యాదగిరిగుట్ట రోడ్డు మార్గంలో పాత గుట్ట వద్ద మూలమలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడం లేదు. ఈ మార్గం గుండా ప్రయాణించేటప్పుడు భయంగా రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనం అసలు కనబడడం లేదు. పలుమార్లు ప్రమాదాల నుంచి తప్పించుకున్నాం. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– మేకల శ్రీరామ్, వాహనదారుడు, దాతర్‌పల్లి

**ఇబ్బందులు పడుతున్నాం**



రోడ్డు మార్గాల్లో ఉన్న మూల మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కాచారం నుంచి యాదగిరిగుట్టకు వెళ్లే మార్గంలో మూలమలుపులు మరీ దారుణంగా ఉన్నాయి. మూలమలుపుల వద్ద ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించాలని కోరుతున్నాం.

– బేజాడి కుమార్, కాచారం

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ

చౌటుప్పల్ : ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 52మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ సందీప్‌కుమార్, వైస్‌ఎంపీపీ ఉప్పు భద్రయ్య, ఆర్‌ఐ సుధాకర్‌రావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో..**

మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 30 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు ఎండీ. బాబాషరీఫ్, గోపగోని లక్ష్మణ్, బండమీది మల్లేష్, ఆలె నాగరాజు, కొరగోని లింగస్వామి, సుల్తాన్ రాజు, బత్తుల రాజ్యలక్ష్మి, కాసర్ల మంజుల శ్రీనివాస్‌రెడ్డి, ఉబ్బు వెంకటయ్య, దండ అరుణ్‌కుమార్, అంతటి బాలరాజు, బొడిగె బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి




మాట్లాడుతున్న కల్లూరి మల్లేశం

భువనగిరి : ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చకనే ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి అధికారం కట్టబెట్టారన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులకు సరైన వేతనం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనికి తగిన వేతనం లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి దోనూరి నర్సిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండీ పాషా, సోములు, నాయకులు బోడ భాగ్య, మాయ కృష్ణ, సురేందర్, నందీశ్వర్, మాతయ్య, వెంకటేశం, జహంగీర్, మధు, దాసు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల సంబరాలు



యాదగిరిగుట్ట : బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు



రాజాపేటలో..

రాజాపేట : ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ప్రభుత్వ విప్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నెమిల మహేందర్ గౌడ్, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగె పెంటయ్య గౌడ్, బాలరాజు గౌడ్, నెమిల కేదారి, రాంజీ నాయక్, సుమలత, రంగ నరేష్, యూత్ నాయకులు ఇంజ నరేష్, బల్ల యాదేష్, గంధమల్ల నర్సింహులు, మోటె బాలమల్లేశం, కొక్కొండ సిద్దులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ప్రభుత్వ విప్‌గా నియమించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ బీర్ల అయిలయ్య నాయకత్వంలో ఆలేరు నియోజక వర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ జిల్లాల శేఖరరెడ్డి, సర్పంచ్ జన్నాయికోడె నగేష్, ఉప సర్పంచ్ నవ్య, మండల ప్రధాన కార్యదర్శి కందడి అనంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను ప్రభుత్వ విప్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతిగౌడ్, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేశం బిట్టు హరీష్, గౌళికార్ రాజేష్, బరిగే రాంచందర్, నువ్వుల రమేష్, బొజ్జ సాంబేష్, గుండు నర్సింహ, ఎండీ సలీం, శ్రీరాంమూర్తి, బిట్టు కిశోర్, కస్తూరి, గుండ్లపల్లి ముత్యాలు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ప్రభుత్వ విప్‌గా నియమించడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు నాయక్, ఎంపీటీసీలు ఏర్వ హేమంత్ రెడ్డి, శ్రీహరి నాయక్, ఈదమ్మ, మర్రి కృష్ణారెడ్డి, భగవంత రెడ్డి, రామిడి జంగారెడ్డి, దేశెట్టి చంద్రశేఖర్ ఉన్నారు.

తుర్కపల్లి: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ప్రభుత్వ విప్‌గా నియమించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ బోరెడ్డి వనజహన్మంతరెడ్డి, మాజీ సర్పంచ్ సోమోల్ల వెంకటేశ్‌యాదవ్, డొంకెన వెంకటేశ్‌గౌడ్, కిష్టయ్య, రఘు, ఆకుల శేఖర్, శ్రీరాంమూర్తి, కిష్టయ్య, రంజిత్, రాజుగౌడ్, మహేందర్‌నాయక్, రవినాయక్, భాస్కర్‌నాయక్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

చౌటుప్పల్ : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ ఎస్.దేవేందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దీపా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివీస్ పరిశ్రమ సేవలు అభినందనీయం



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

చౌటుప్పల్ : విద్యారంగ అభివృద్ధికి దివీస్ పరిశ్రమ చేస్తున్న కృషి అభినందనీయమని సర్పంచ్ కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవలమ్మనాగారం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో బ్యాగులు, సాండిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. దివీస్ పరిశ్రమం అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు వల్లూరి వెంకటరాజు, ఎస్. సాయికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రానికి ఉగ్గె భిక్షపతి శుక్రవారం మృతి చెందాడు. పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖరరెడ్డి, సర్పంచ్ జన్నాయికోడె నగేష్‌లు భిక్షపతి మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక సహకార పరపతి సంఘం తరపున మృతుడి కుటుంబానికి రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు.అదేవిధంగా కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నోముల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దిగోజు నర్సింహచారి, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, ఉప సర్పంచ్ నవ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, ఎంపీటీసీ యాస కవిత, నాయకులు కోరె వెంకన్న, నాతి రాజు, బూడిద శేఖర్, మజ్జిగ రాంబాబు పాల్గొన్నారు.

**లింగరాజుపల్లిలో..**

ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన సల్ల సైదులు ఐదు నెలల క్రితం మృతి చెందాడు. ఆయన కుమారులు మహేశ్, శివలకు శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రూ. 30వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్‌గుప్తా, ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి, సర్పంచ్ జన్నాయికోడె నగేష్, నాయకులు ఎర్ర విఠల్‌రెడ్డి, భాషబోయిన పాపయ్య, ఎర్ర బుచ్చిరెడ్డి, మెట్టు తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రేపు జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీలు

భువనగిరి : ఈ నెల 17న ( ఆదివారం) జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కోనేటి గోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14, 16 సంవత్సరాల వయస్సు గల క్రీడాకారుల మాత్రమే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు 2024 ఫిబ్రవరిలో గుజరాత్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9949271718 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు

భువనగిరి : పట్టణంలోని స్థానిక చెరువు వద్ద గల ఉజలే షా దర్గా గంధం ఊరేగింపును శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూల ఛాదర్ నిర్వహించి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు ఎండీ అలీం ఉద్దీన్, ఎండీ జీయా ఉద్దీన్, షాబుద్దీన్, సిరాజ్, సుజాద్దీన్, అమీన్, ఇబ్రహీం, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప మాలధారులకు అన్నదానం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని శ్రీసత్యదేవ సహిత అయ్యప్పస్వామి, శ్రీబాలాజీ రామకృష్ణ దేవాలయాల్లో శుక్రవారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో దేవాలయాల చైర్మన్లు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

## గిరిజనులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి



మాట్లాడుతున్న సంతోష్‌నాయక్

తుర్కపల్లి: గిరిజనులకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు భూక్య సంతోష్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 45 లక్షల గిరిజనుల ఆకాంక్షను, ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రవినాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా నాయకులు ప్రవీణ్‌నాయక్, సురేశ్ నాయక్, రమేశ్‌నాయక్, మండల అధ్యక్షుడు వెంకటేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆలేరురూరల్ : పట్టణ కేంద్రంలోని బీజేపీ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని నిర్వహించారు. శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బడుగు జహంగీర్, నియోజక వర్గ అసెంబ్లీ కన్వీనర్ చిరిగె శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి మహేష్, చింతకింది కీర్తి, కటకం రాజు బందెల సుభాష్, తోట మల్లయ్య, కిషన్, శ్రీనివాస్, మురళి, వెంకటేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### హౌసింగ్ బోర్డు కాలనీలో దొంగల హల్‌చల్

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ సృష్టించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు కాలనీలోని సోమదాస్‌రెడ్డి ఇంట్లోకి చొరబడి 15వేల నగదు, అర తులం బంగారం దోచుకెళ్లారు. దాస్‌రెడ్డి భార్య లలిత పక్క గదిలో పడుకొని ఉండగా గది బయట ఇనుప రాడ్డు బిగించి బయటకు రాకుండా చేశారు. దోపిడీ విషయం తెలువని ఆమె డోర్ తెరిచేందుకు ప్రయత్నించగా తెరుచుకోలేదు. దీంతో పక్కింటి వారికి ఫోన్ చేయడంతో వారు రాగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. దుండగులు మరికొన్ని ఇళ్లలో చోరీకి యత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి : భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు తడక వెంకటేశం, ప్రధానకార్యదర్శి రాపోలు జ్ఞానేశ్వర్, కోశాధికారి భారత వాసుదేవ్, కార్యదర్శి తడక యాదగిరి, భారత లవకుమార్, సూరెపల్లి రమేశ్, సూరెపల్లి శ్రీనివాస్, గంజి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి : ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం సినీ నిర్మాత దిల్‌రాజు కుమార్తె హన్సిత రెడ్డి తన భర్తతో కలిసి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

భువనగిరి క్రైం: పోచంపల్లి గ్రామానికి చెందిన గోదాసు శివ శంకర్ పది రోజుల క్రితం బైక్ మీద వెళ్తుండగా బొల్లేపల్లి గ్రామ శివారులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫోన్ ఐఎంఈఐ ఆధారంగా పోలీసులు ఫోన్ కనిపెట్టి శనివారం బాధితుడికి అప్పగించారు.

### పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మ

మర్రిగూడ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మిర్యాల పద్మ అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని కొట్టాల గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం నిర్వహించారు. చేతుల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సౌజన్య, మంగమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు వినతి

మునుగోడు: తమ గ్రామానికి చెందిన దాదాపు 100 మంది ఓటు హక్కు మునుగోడులోని పలు బూత్‌లలో ఉన్నాయని, వాటిని తమ సొంత గ్రామమైన గుండ్లోరిగూడేనికి మార్చాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జంగిలి నాగరాజు కోరారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బూత్ నంబర్ 165లో కేవలం 295 మందికి మాత్రమే ఓటువేసే అవకాశం ఉందని, మిగిలిన 104 మంది ఓటు మునుగోడులోని 163, 164, 157, 159 బూత్‌లల్లో ఉన్నాయని తెలిపారు. ఓటర్లు మునుగోడుకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వస్తుందని, వీరిని తమ బూత్‌లోకి మార్చాలని కోరారు.

### పది క్వింటాళ్ల పత్తి దగ్ధం



మిల్లులో దగ్ధమైన పత్తి

వలిగొండ : ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పది క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. ఈ ఘటన వలిగొండ మండలం నర్సాయిగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాయిగూడెంలో గల ఎస్‌టీఎల్ పత్తి మిల్లులో సాయంత్రం మంటలు అంటుకుని పొగలు వ్యాపించాయి. సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకువచ్చే సరికి పది క్వింటాళ్ల పత్తి దగ్ధమైందని మిల్లు సూపర్‌వైజర్ వెంకటేశ్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు.

### చెట్టును ఢీకొట్టిన వరికోత మిషన్

వలిగొండ : వరికోత మిషన్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వలిగొండ మండలం మొగిలిపాక గ్రామం నుంచి డ్రైవర్ శ్రీకాంత్ శుక్రవారం వరికోత మిషన్ నడుపుకుంటూ వెల్వర్తికి బయలుదేరాడు. గ్రామ శివారులోకి వెళ్లగానే అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. అటుగా వెళుతున్న ప్రయాణికులు గమనించి గాయపడిన శ్రీకాంత్‌ను 108వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## నిరుపయోగంగా బస్టాండ్

- బస్టాండ్‌లోకి రాకపోకలు సాగించని బస్సులు
- పిచ్చి మొక్కలు, కంప చెట్లతో దర్శనమిస్తున్న ఆవరణ
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రయాణికులు



గుండాలలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్

గుండాల: మండల కేంద్రంలో గత 25 సంవత్సరాల క్రితం నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి రాజ్యసభ సభ్యుడు ఆకారపు సుదర్శన్ విడుదల చేసిన నిధులతో బస్టాండ్ నిర్మించారు. బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలు లేకపోవడంతో పిచ్చి మొక్కలు, కంప చెట్లతో నిండి పోయింది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్‌ను పాలకులు నిర్లక్ష్యంతో వదిలివేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ప్రతి నిత్యం మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులు, మహిళలకు, విద్యార్థులకు నిలువ నీడ లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రయాణికుల కోసం నిర్మించిన ఈ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**ఉపయోగంలోకి తీసుకురావాలి**



గుండాల మండల కేంద్రంలో నిర్మించిన బస్టాండ్‌ను గత పాలకులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇక్కడ మద్యం సేవిస్తున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి వచ్చిపోయే విధంగా చర్యలు చేపట్టాలి. కనీస వసతులు కల్పించి ఉపయోగంలోకి తీసుకురావాలి.

– దేవనబోయిన శోభన్‌బాబు, గుండాల